## వదంతులను నమ్మకండి

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- అక్రమ నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు



06

## 16 నుంచి ఒంటి పూట బడులు

- భానుడి భగభగల నుంచి విద్యార్థులకు ఊరట
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తప్పనిసరి
- పదోతరగతి పరీక్షా కేంద్రాలకు మినహాయింపు



06

సంపుటి :03 | సంచిక :34 | పేజీలు :07 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 12, మార్చి 2026



## బాధ్యతాయుతంగా పనిచేయాలి

- ప్రజాప్రతినిధులకు మంత్రి కొండా సురేఖ సూచన
- 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు
- పాల్గొన్న మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

02

# కాకతీయ వైభవానికి 'జాతీయ' కిరీటం

నలు దిశలా రామప్ప ఆలయ సౌరభాలు

- ఇప్పటికే ఆలయానికి యునెస్కో గుర్తింపు
- తాజాగా గొల్లల గుడి, శివతారకేశ్వర ఉప ఆలయాలకూ జాతీయ హోదా
- పర్యాటక రంగ ప్రగతికి ఊతం
- ఆలయాలజీర్ణోద్ధరణకు అడుగులు

02

ములుగు జిల్లా పాలంపేట మట్టిలో ఒదిగిన కాకతీయ శిల్పకళా సౌరభం ఇప్పుడు దేశవ్యాప్తంగా పరిమళించనుంది. ఇన్నాళ్లూ రామప్ప ప్రధాన ఆలయం ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతోంది. 2021 యునెస్కో గుర్తింపు సైతం సాధించి తన వైభవాన్ని చాటుకున్నది. తాజాగా ఈ ఆలయ నీడనే ఉన్న గొల్లల గుడి, శివతారకేశ్వర ఆలయాలకూ జాతీయ హోదా దక్కింది. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఈ ఉప ఆలయాలకు జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేసింది. ఈ పరిణామంతో ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక కీర్తి దశదిశలా వ్యాపించింది.

– అక్షరదర్బార్, వరంగల్



## రైతన్నల మోటార్లకు కన్నం

02

- అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు!
- 71 కరెంట్ మోటార్లు స్వాధీనం
- ఏడుగురు నిందితుల అరెస్ట్




## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలి.. మేయర్
- ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు

04




## పరిశుభ్రతే లక్ష్యంగా 'ప్రజాపాలన'

- 99 రోజుల ప్రణాళికతో పల్లెలు, పట్టణాల రూపురేఖలు మార్చాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- జూన్ 12 వరకు పకడ్బందీగా కార్యాచరణ: జిల్లా కలెక్టర్
- ప్రజాప్రతినిధులకు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' శిక్షణ కార్యక్రమం

03




## ఘోర రోడ్డు ప్రమాదం



- ఇద్దరు యువకులు మృతి
- లచ్చ తండా వద్ద బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

06



## కాకతీయ వైభవానికి
# 'జాతీయ' కిరీటం

- నలు దిశలా రామప్ప ఆలయ సౌరభాలు
- ఇప్పటికే ఆలయానికి యునెస్కో గుర్తింపు
- తాజాగా గొల్లల గుడి, శివతారకేశ్వర ఉప ఆలయాలకూ జాతీయ హోదా
- పర్యాటక రంగ ప్రగతికి ఊతం
- ఆలయాల జీర్ణోద్ధరణకు అడుగులు

**అక్షరదర్బార్, వరంగల్ :**

ములుగు జిల్లా పాలంపేట మట్టిలో ఒదిగిన కాకతీయ శిల్పకళా సౌరభం ఇప్పుడు దేశవ్యాప్తంగా పరిమళించనుంది. ఇన్నాళ్లూ రామప్ప ప్రధాన ఆలయం ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతోంది. 2021 యునెస్కో గుర్తింపు సైతం సాధించి తన వైభవాన్ని చాటుకున్నది. తాజాగా ఈ ఆలయ నీడనే ఉన్న గొల్లల గుడి, శివతారకేశ్వర ఆలయాలకూ జాతీయ హోదా దక్కింది. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఈ ఉప ఆలయాలకు జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేసింది. ఈ పరిణామంతో ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక కీర్తి దశదిశలా వ్యాపించింది. చరిత్ర గర్భంలో నిద్రాణమైన అద్భుత కట్టడాలకు మహర్దశ మొదలైంది. జాతీయ హోదా దక్కడం వల్ల ఈ ఉప ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు అందుతాయి. పురావస్తు శాఖ ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తుంది. శిథిలావస్థకు చేరిన గోడలకు శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మతులకు అవకాశం ఉంటుంది. ఆధునిక సాంకేతికతతో పాత వైభవాన్ని తిరిగి తీసుకువస్తారు. ఆలయ ప్రాంగణాల్లో పచ్చని ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తారు. రాత్రి వేళల్లో మెరిసిపోయేలా విద్యుత్ దీపాలంకరణ చేస్తారు. నిరంతరం నిధులు అందుబాటులో ఉండటం వల్ల నిర్వహణలో జాప్యం జరగదు.

**- టూరిజం డెవలప్ మెంట్**

ఇప్పటి వరకు ఈ ఉప ఆలయాల చుట్టూ రక్షణ సరిగ్గా ఉండేది కాదు. ఇప్పుడు జాతీయ స్మారక చిహ్నాల చట్టం అమలులోకి వస్తుంది. ఆలయ పరిసరాల్లో వంద మీటర్ల వరకు ఎలాంటి కొత్త నిర్మాణాలు చేయడానికి వీలుండదు. అక్రమ ఆక్రమణల నుంచి ఈ కట్టడాలకు విముక్తి లభిస్తుంది. సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణ పెరుగుతుంది. విదేశీ పర్యాటకులు వచ్చే ప్రాంతం కాబట్టి భద్రత కట్టుదిట్టంగా ఉంటుంది. మన పూర్వీకులు అందించిన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు పదిలంగా అందించే అవకాశం కలుగుతుంది. వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప ఆలయాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులు ఇకపై ఈ ఉప ఆలయాల వద్ద కూడా ఎక్కువ సమయం గడుపుతారు. జాతీయ గుర్తింపు వల్ల గూగుల్ మ్యాప్స్ నుంచి పర్యాటక శాఖ కరపత్రాల వరకు అన్నింటిలోనూ వీటి పేరు ప్రముఖంగా కనిపిస్తుంది. గైడ్లు ఈ ఆలయాల విశిష్టతను ప్రత్యేకంగా వివరణలు ఆన్‌లైన్‌లో లభిస్తాయి. దీనివల్ల స్థానిక పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. హోటళ్లు, రవాణా, గైడ్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ములుగు పర్యాటక పరంగా అంతర్జాతీయ స్థాయిలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది.

**- గణపతి దేవుడి కాలపు శిల్పకళా నిధి**

క్రీస్తు శకం 1213లో రేచర్ల రుద్రుడు నిర్మించిన రామప్ప ఆలయ సముదాయం అద్భుతాలకు నిలయం. గర్భగుడిలో కొలువైన రుద్రేశ్వరుడితో పాటు సమీపంలోని ఉప ఆలయాలు కాకతీయ నిర్మాణ శైలికి అద్దం పడతాయి. గొల్లల గుడి నిర్మాణం, శివతారకేశ్వరాలయ శిల్పాలు అప్పటి శిల్పి రామప్ప ప్రతిభకు నిదర్శనాలు. నీటిపై తేలే ఇటుకలు, భూకంపాలను తట్టుకునే ఇసుక పునాదులు వీటి ప్రత్యేకత. ఈ విజ్ఞానాన్ని పరిశోధించేందుకు దేశ విదేశాల నుంచి పరిశోధకులు వచ్చే వీలుంది. ఈ పరిణామం తెలంగాణ గడ్డపై ఉన్న చారిత్రక సంపదకు దక్కిన అరుదైన గౌరవం.




## బాధ్యతాయుతంగా పనిచేయాలి

**- ప్రజాప్రతినిధులకు మంత్రి కొండా సురేఖ**

అక్షరదర్బార్, గీసుగొండ:ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం మరియాపురంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, పదవులు శాశ్వతం కావని, ప్రజలకు చేసే సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని ఆమె హితవు పలికారు. గత రెండేళ్లలో రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల లబ్ధిని ప్రతి కుటుంబానికి చేర్చడంలో ప్రజాప్రతినిధులు చురుగ్గా పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇటీవల మరణించిన గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు గుర్తింపు కార్డులు అందజేసి, వివిధ శాఖల స్టాళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వైవీ గణేష్ పాల్గొన్నారు.

# రైతన్నల మోటార్లకు కన్నం

- అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు!
- 71 కరెంట్ మోటార్లు స్వాధీనం.. ఏడుగురు నిందితుల అరెస్ట్



అక్షరదర్బార్, హనుమకొండ : వ్యవసాయ బావులు, కాల్వల వద్ద ఉండే విద్యుత్ మోటార్లను దొంగిలిస్తూ రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను వరంగల్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ సీసీఎస్, కమలాపూర్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఈ ఆపరేషన్‌లో మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 6,60,000 విలువైన 71 కరెంట్ మోటార్లు, ఒక ఆటో ట్రాలీ, ఒక కారు (దొంగతనానికి వాడిన వాహనాలు), 3 మొబైల్ ఫోన్లను నుంచి స్వాధీన పరుచుకున్నారు.

**- ముఠా సభ్యులు వీరే..**

అరెస్టైన వారిలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన సిరిగిరి ప్రసాద్ (ఓదెల), మోతే రాజు (మంచిర్యాల), టేకు నవీన్ (గోదావరిఖని), మోటం తిరుపతి (మంచిర్యాల), వారణాసి లక్ష్మణ్ (మంచిర్యాల), మోటం నరేష్ (మంచిర్యాల), వస్తం భీమేష్ (మంచిర్యాల) ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. మద్యం సేవించడం, ఇతర జల్సాలకు అలవాటు పడిన ఈ నిందితులు సులభంగా డబ్బు సంపాదించే మార్గంగా వ్యవసాయ మోటార్లను ఎంచుకున్నారు. గతంలో వీరు కరీంనగర్, రామగుండం పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు దొంగిలించిన కేసుల్లో జైలుకు కూడా వెళ్ళి వచ్చారు. అయినా ప్రవర్తన మార్చుకోకుండా మళ్ళీ వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు.

**- ఎక్కడెక్కడ దొంగతనాలు చేశారంటే?**

విచారణలో నిందితులు వివిధ జిల్లాల్లో తమ చేతివాటం ప్రదర్శించినట్లు తేలింది వరంగల్ కమిషనరేట్ లో కమలాపూర్, దామెర పరిధిలో 34 మోటార్లు, కరీంనగర్ కమిషనరేట్ లో కేశవపట్నం, సైదాపూర్, ఇల్లంతకుంట ప్రాంతాల్లో 36 మోటార్లు, భూపాలపల్లి జిల్లా రేగొండ పరిధిలో ఒక మోటార్ దొంగిలించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. వంగపెల్లి క్రాస్ రోడ్ వ అనుమానాస్పదంగా ఆటో ట్రాలీ, కారులో వస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# కల్వకుంట్ల కవిత ఇంటికి సీబీఐ

- ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సమన్లు
- 16న విచారణకు హాజరు కావాలని నోటీస్
- ఏ మాత్రం వెనక్కి తగ్గను : కవిత



అక్షరదర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి గురువారం సీబీఐ అధికారులు చేరుకున్నారు. ఢిల్లీ మద్యం కేసులో ఆమెకు సమన్లు అందజేశారు. ఈ కేసులో సీబీఐ చేసిన అభియోగాలు నిరాధారమంటూ ఇటీవల ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ వెంటనే ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని కోరుతూ అధికారులు తాజాగా కవితకు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 16వ తేదీన అధికారుల ముందు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీ ఏర్పాటు దిశగా ఆమె అడుగులు వేస్తున్న తరుణంలో ఈ పరిణామం ఉత్కంఠ రేపుతోంది.

**- సత్యం తోడుంది.. నేను వెనకాడను: కవిత**

సీబీఐ నోటీసులు అందజేసిన అనంతరం కవిత సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘంగా స్పందించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తనపై వచ్చిన ఆరోపణలన్నీ కల్పితాలని ఆమె మరోసారి స్పష్టం చేశారు. చార్జ్ షీట్‌లో పేర్కొన్న అంశాలను గతంలోనే రౌజ్ అవెన్యూ కోర్టు తప్పు పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. దర్యాప్తు సంస్థ తీరును కోర్టు ఆక్షేపించిందని ఆమె పేర్కొన్నారు. విచారణాధికారి వైఖరిపై విచారణ జరపాలని కోర్టు చెప్పడం తన నిజాయితీకి నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందిన నోటీసులను తన న్యాయ నిపుణుల బృందం పరిశీలిస్తోందని కవిత వెల్లడించారు. చట్టంపై తనకు అపారమైన గౌరవం ఉందని చెప్పారు. దర్యాప్తు సంస్థలు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. సత్యం తన పక్షాన ఉన్నంత వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రాజకీయ కుట్రల భాగంలోనే తనకు పదే పదే నోటీసులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐదు నెలల పాటు తీహార్ జైలులో ఉండి వచ్చిన తనను ఏ శక్తులు భయపెట్టలేవని కవిత ఘాటుగా స్పందించారు. కేసు విచారణలో భాగంగా అధికారులకు తాను సంపూర్ణంగా సహకరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ నెల 16న విచారణకు హాజరయ్యే విషయంపై లీగల్ టీమ్ సలహా మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానాన్ని అడ్డుకునేందుకే ఇదంతా జరుగుతోందని కవిత ఆరోపించారు. ప్రజల దీవెనలు, ధర్మం తన వెంటే ఉన్నాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# పరిశుభ్రతే లక్ష్యంగా 'ప్రజాపాలన'

- 99 రోజుల ప్రణాళికతో పల్లెలు, పట్టణాల రూపురేఖలు మార్చాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- జూన్ 12 వరకు పకడ్బందీగా కార్యాచరణ.. జిల్లా కలెక్టర్
- ప్రజాప్రతినిధులకు 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' శిక్షణ కార్యక్రమం



అక్షరదర్బార్, భూపాలపల్లి : స్థానిక వనరుల ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ, గ్రామాలు మరియు పట్టణాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, వంగిన పోల్స్ గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు కాల్వల శుభ్రత, వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలి. కోతులు, కుక్కల సమస్య నివారణకు స్థానిక నిధులను వినియోగించాలి. 14-15 ఏళ్ల వయస్సున్న బాలికలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలి. జిల్లాలో గుర్తించిన 2425 మంది బాలికలకు వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తయ్యేలా చూడాలని ఆయన కోరారు.

### - షెడ్యూల్ ప్రకారం సాగాలి : కలెక్టర్

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయాల్సిన 99 రోజుల కార్యాచరణ షెడ్యూల్‌ను వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను గ్రామాల్లో ప్రదర్శించాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టనున్న 99 రోజుల ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, ఏఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లి ఎస్సైగా సురేష్ బాధ్యతలు స్వీకరణ



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి నూతన ఎస్సైగా 2020 బ్యాచ్ కి చెందిన ఎం సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై సురేష్ గతంలో ములుగు జిల్లా పరిధిలోని కన్నాయిగూడెం. మంగపేట. ఎస్సైగా విధులు నిర్వహించి ములుగు విఆర్ నుండి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మొగుళ్ళపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా ఆయన విలేకేరులతో మాట్లాడుతూ.. మొగుళ్లపల్లి మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజా సేవకు అంకిత భావంతో కృషి చేస్తామని తెలిపారు.



# విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: వంగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొట్లపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వంగ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేష్ యాదవ్ పరీక్ష ప్యాడ్లు, ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయని, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహమూర్తి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి మొక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

### –ఎంసీపీఐయూ నేత జన్ను రమేష్

అక్షరదర్బార్, చెన్నారావుపేట : యాసంగి సీజన్‌లో రైతులు పండించిన మొక్కజొన్నలకు క్వింటాల్‌కు రూ.2500 మద్దతు ధర ప్రకటించాలని ఎంసీపీఐయూ చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేస్తూ ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ పంటను ప్రైవేటు మధ్యదళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల ధరలు పెరిగి రైతులపై భారం పెరిగినప్పటికీ పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. యాసంగి సీజన్‌లో మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారని, కానీ ప్రస్తుతం సరైన ధరలు లేక నష్టపోతున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వం రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొర్రి శ్రీను, అశోక్, రాజిరెడ్డి, గోరే మియా తదితరులు పాల్గొన్నారు.



# ఓంకార్ రాజకీయ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం

### –ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాపురావు




అక్షర దర్బార్, దుగ్గొండి : కమ్యూనిస్టు నాయకుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ జీవితం భావి తరాలకు ఆదర్శనీయమని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాపురావు అన్నారు. గురువారం దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్‌లో మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని దుగ్గొండి మండల పార్టీ కార్యదర్శి సింగతి మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ ఈనెల 17న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "చట్టసభలలో ఓంకార్ గారి పాత్ర" అనే అంశంపై సదస్సు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు పార్టీ జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, డివిజన్ కమిటీ సభ్యులు గటికె జమున, డాక్టర్ కోటేశ్వర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# 17న స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల ఎంపికలు

### పరకాల ఎంఈవో రమాదేవి

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో 2026–27 విద్యాసంవత్సరానికి నాలుగవ తరగతి ప్రవేశాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పర కాల మండల విద్యార్థులకు ఈ నెల 17న మం డల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎస్. రమాదేవి తెలిపారు. ఈ ఎంపికలు పరకాల ప్రభుత్వ ఉన్న త పాఠశాల ప్రాంగణంలో నిర్వహించబడతాయ ని ఆమె పేర్కొన్నారు.ఈ ప్రవేశాలకు 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించి ప్రస్తుతం మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యా ర్థుల తల్లిదండ్రులు ఈ నెల 12వ తేదీలోగా ఆన్లై న్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయిలో ఎంపి క పోటీలు నిర్వహించి అర్హత సాధించిన వారికి స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని ఎంఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యుడు

అక్షర దర్బార్, నెక్కొండ : మండలంలోని నీడిగొండ గ్రామానికి చెందిన మల్‌రెడ్డి విజయలక్ష్మి – నరేందర్‌రెడ్డి దంపతుల కుమారుడు తరుణ్‌కుమార్‌రెడ్డి – నిఖితల వివాహ వేడుకకు నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి లక్ష్మారెడ్డి, రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్‌రావు, నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, వజ్రాల వెంకట్‌రెడ్డి, గుంటూరు భూలోకరెడ్డి, మువ్వా వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ప్రశాంత్ కు డాక్టరేట్

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన ఆలోని ప్రశాంత్ కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి డాక్టర్ పట్టాను అందుకున్నారు. ఆయన సోషల్ సర్వీస్ డివిజనల్ అండ్ యూత్ డెవల ప్మెంట్ అండ్ సోషల్ జస్టిస్ రంగంలో చేసిన ప్రతిభకు ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. అలోని ప్రశాంత్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలం రూపిరెడ్డి పల్లె గ్రామంలోని రామాలయం ఆలయంలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తు న్నారు. ప్రశాంత్ కు సేవారంగం పట్ల ఉన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు.



## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం రాజుపల్లి గ్రామానికి చెందిన గజ్జెల నరసమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో పరమపదించారు.విషయం తెలుసు కున్న భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబాన్ని గురువారం పరా మర్శించారు.ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మధుకర్ రావు, రాజు, ఐలయ్య, రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, లింగారావు, మాధవరావు, సృజన్, లావుద్య రవీందర్ పాల్గొన్నారు .




## ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం

అక్షర దర్బార్, శాయంపేట : ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం శాయంపేట పీహెచ్ సీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో హన్మ కొండ డీఎంహెచ్ఓ అప్పయ్య, మండల మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణ పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలి.. మేయర్
- సొంత ఆదాయ వనరులపై సర్పంచులు దృష్టి సారించాలి.. కలెక్టర్
- 99 రోజుల కార్యాచరణపై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు




అక్షరదర్బార్, హనుమకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను క్షేత్రస్థా యిలో విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ఈ 99 రోజుల కార్యాచరణ ప్రజాప్రతిని ధులకు ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. గ్రామా ల్లోని పూర్వ విద్యార్థులు, ఎన్నారైలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి బాటలు వేయాలని సూచిం చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాకు అత్యధిక నిధులు కేటాయించారని, వాటిని సద్వినియోగం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా ముందుకెళ్లాలని హితవు పలికారు.

### - ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి.. కలెక్టర్

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. పంచాయతీలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడ కుండా, ఇంటి పన్నులు, భవన నిర్మాణ అనుమతుల ద్వారా సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. మహిళా సర్పంచులు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని, గ్రామాల్లో ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుండేలా చూడాలని కోరారు. సదస్సులో ప్రభుత్వ పథకాలపై ప్రత్యేకంగా రూపొందించిన పీపీటీని ప్రదర్శించారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధి పనులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రజాప్రతినిధులు సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాకారులు పాడిన పాటలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి, ఆర్డీవో రమేష్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, హనుమకొండ జిల్లా పరిధిలోని జీడ బ్ల్యూఎంసీ కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి



అక్షర దర్బార్, శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు.కాంగ్రెస్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాందారిపేట మహిళ గ్రామ కమిటీని ఎన్నుకు న్నారు.గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా కోరే లలిత,ఉపాధ్యక్షురాలు మిద్దెపాక మాధవి,ప్రధాన కార్యదర్శి బడుగు సునీత,కోశాధికారి కూతురు నీలమ్మ,మరియు వల్లెపు శిరీషను సహాయ కార్యద ర్శిగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ప్రకాష్ రెడ్డి,మారేపల్లి రవీందర్ ,కుమారస్వామి,నిమ్మల రమేష్ , కొమ్ముల భాస్కర్ , ఉపసర్పంచ్ రావుల శ్రీను, పైడి, బడుగు అశోక్,కొమ్ముల విష్ణు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు ఆశీర్వాదాలు

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన మర్రి భిక్షపతి, సుగుణ కూతురు మర్రి షణ్మిత రవి వివాహ వేడుకకు బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు, చిట్యాల ఉపసర్పంచి బుర్ర వెంకటేష్ గౌడ్, 9వ వార్డు సభ్యులు మైదం శ్రావ్యా శ్రీకాంత్ హాజరై ఆశీర్వదించారు.



## ఉపాధి కూలీలకు అరటిపండ్లు పంపిణీ

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలోని పెద్దగట్టు గుట్ట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ ముడుతనపల్లి మోహన్ పరి శీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీకి రూ.307 వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వారికి అరటిపం డ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపస ర్పంచ్ చింతల మానస–కిషోర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ పోతిరెడ్డి కుమారస్వామి, కూలీలు పాల్గొన్నారు.






## చిట్యాల ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అక్షర దర్బార్, చిట్యాల, మార్చి 12 : చిట్యాల మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ (ఎస్‌హెచ్ఓ)గా బాధ్యతలు చేపట్టిన పి. సతీష్‌ను చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ కిరణ్, గోల్కొండ నాగరాజు, చిరంజీవి, చిట్యాల టౌన్ అధ్యక్షుడు సుమన్, తీగల నాగరాజు, కట్ల మహేష్, రాంబాబు, రాజేష్, భద్రి, శ్రీధర్, కేతిరి అశోక్ పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల్లో విజేతలుగా నిలవండి



అక్షర దర్బార్, శాయంపేట : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపు అని, ఈ పరీక్ష లను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజేతలుగా నిలవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగు అశోక్ సూచించారు. పరీక్షల కోసం సమయాన్ని సక్రమంగా ప్రణాళిక చేసుకుని ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించాలని తెలిపారు. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి కఠినమైన విషయాలను ఉదయం సమయంలో చదవడం మంచిదని పేర్కొన్నారు. ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసి యేషన్ ఫోన్ నంబర్లు 9391117100, 9440890073కు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

# ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

- మంత్రి సీతక్క



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లా గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు 12 శాఖలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని సొంత ఇంటిలా భావించి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించిందని, మరిన్ని నిధులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఉత్తమ గ్రామపంచాయతీలను గుర్తించేందుకు కేంద్రం తొమ్మిది అంశాలను నిర్ణయించిందని, వాటిని పాటించి దేశంలోనే ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ చంద్రకళ, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్ అధికారులు పాల్గొన్నారు.




## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

- ద్విచక్ర వాహనం సీజ్

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండల కేంద్రం నుండి నిషేధిత గంజాయిని తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ గారి ఆదేశంతో సిసిఎస్ టీమ్ చిట్యాల పోలీసులు సంయుక్తంగా వాహనాలను మండల కేంద్రంలో తనిఖీ చేస్తున్న క్రమంలో చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పోతుల నరసింహారావు పల్లెర్ల మధుకర్లు ద్విచక్ర వాహనంపై ఒక కిలో 300 గ్రాముల నిషేధిత గంజాయిని తరలిస్తూ పట్టుపడ్డారని ఆయన తెలిపారు. వారి నుండి 65 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనం సీజ్ చేయడం జరిగిందని ఇద్దరినీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్కు తరలించడం జరిగిందని సిఐ తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్, సెకండ్ ఎస్ఐ హేమలత హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి కానిస్టేబుల్ సతీష్ లు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం

- జననివాసాల మధ్య పశువుల పెంపకం
- కాలనీవాసుల ఆవేదన...
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

అక్షర దర్బార్,పరకాల:
పరకాల పట్టణంలోని పలు వార్డుల్లో చెత్తాచెదారం, మురుగు నీరు, జననివాసాల మధ్య పశువుల పెంపకం వంటి సమస్యలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆసుపత్రి వెనుక చెత్త కుప్పలు

పరకాల పట్టణంలోని 10వ వార్డులో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ప్రాంతాలు చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. ముఖ్యంగా గవర్నమెంట్ హాస్పిటల్ పక్కన ఉన్న వైనాలవాడ ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుపోయి తీవ్ర అసౌకర్య పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోయి గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తూ పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తోంది.

### చీడపీడలతో భయాందోళన

చెత్త కుప్పలు పెరిగిపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తుండటం సాధారణమైందని స్థానికులు తెలిపారు. అంతేకాకుండా పాములు కూడా తిరుగుతుండటంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నపిల్లలు బయటకు వెళ్లడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది.

### జననివాసాల మధ్య పశువుల పెంపకం

ఇదే సమయంలో పరకాల పట్టణంలోని 9వ వార్డులో గౌడ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసాల మధ్య గేదెలను పెంచుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పశువుల వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు అధికంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు.

### ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం

ఈ సమస్యలపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. చెత్తను తొలగించాలని, జనావాసాల మధ్య పశువుల పెంపకాన్ని నిలిపివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వెంకటరమణ

- రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఉత్తర్వులు
- బాల్యం నుంచే సంఘ్ సంస్కారంతో ఎదిగిన నేత
- వృత్తిరీత్యా వైద్యుడైనా.. ప్రవృత్తిగా సేవా కార్యక్రమాలు



అక్షరదర్బార్, వరంగల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సీనియర్ నాయకులు, ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ వన్నాల వెంకటరమణ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పార్టీ ప్రకటించింది.
గతంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేసిన వెంకటరమణ సేవలను గుర్తించి పార్టీ ఈ కీలక బాధ్యతను అప్పగించింది.

### - సంఘ్ శిక్షణ.. రాజకీయ వారసత్వం

డాక్టర్ వెంకటరమణ చిన్నతనం నుంచే ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌గా క్రమశిక్షణతో పెరిగారు. నర్సంపేట గురుకుల విద్యాలయంలో చదువుకునే రోజుల్లోనే 'ముఖ్య శిక్షక్'గా సేవలందించారు. ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, జనసంఘ్ కాలం నుండి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా వెంకటరమణ కూడా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

### - వైద్యునిగా, సేవకునిగా గుర్తింపు

ఎండీఎస్, పీహెచ్ డీ పూర్తి చేసిన వెంకటరమణ అంతర్జాతీయ స్థాయిలో దంతవైద్య నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు. కేవలం వృత్తికే పరిమితం కాకుండా, గత 20 ఏళ్లుగా 'వాక్ ఫౌండేషన్' ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 500 పేద కుటుంబాలకు నెలకు 10 కిలోల సన్నబియ్యం పంపిణీ చేశారు. అనాథ పిల్లల చదువుల కోసం పాఠశాల, కళాశాల ఫీజులు చెల్లిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు.

### - పార్టీ బలోపేతమే లక్ష్యం

తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుకు, జాతీయ నాయకత్వానికి డాక్టర్ వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ జెడ్పీటీసీ పరామర్శ..

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన నీలం శ్యామ్ సుందర్, మహేందర్ గార్ల మాతృ మూర్తి క్రీ,శే నీలం వీరక్క ప్రథమ వర్ధంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలపుర గ్రామ శాఖ అధ్యక్షులు కొండ కృష్ణ, మండల నాయకులు కాట్రేవుల కుమార్ శ్రీరాం, సదయ్య, దుప్పటి శ్రీను, పోశాల రాజు, ఏరుకొండ రఘు, పోతుగంటి వీరాస్వామి పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ఫిరాయింపుల కేసు క్లోజ్!

- అనర్హత పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారు..
- స్పీకర్ తరపు అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వి వాదన
- కేసు కొనసాగించాల్సిన అవసరం లేదని వ్యక్తీకరణ
- వాదనలతో ఏకీభవించి కేసు కొట్టేసిన అత్యున్నత న్యాయస్థానం
- బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ.. తదుపరి కార్యాచరణ?



అక్షరదర్బార్, న్యూఢిల్లీ : తెలంగాణ రాజకీయాల్లో అలజడి సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లను గురువారం అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ఈ మేరకు తుది తీర్పును ప్రకటించింది. అసెంబ్లీ స్పీకర్ ఇప్పటికే ఈ అంశంపై విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకున్నట్లు స్పీకర్ తరపు అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వి అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. స్పీకర్ కార్యాలయం పిటిషన్లను పరిష్కరించినందున ఇక విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, అభిషేక్ మను సింఘ్వి వాదనలతో జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. స్పీకర్ ఇప్పటికే ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకున్నందున, ఇక ఈ పిటిషన్లపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించిన కోర్టు విచారణ ముగిసినట్లేనని ప్రకటించింది. అదేవిధంగా 2 రోజుల్లో స్పీకర్ తన తీర్పు కాపీలు ఫిర్యాదుదారులకు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు పేర్కొంది.

### - న్యాయస్థానంలో ముగిసిన వివాదం

అసెంబ్లీ స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని ఆయన వివరించారు. ఈ వాదనలతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. స్పీకర్ తీసుకున్న తీర్పు ప్రతిని రెండు రోజుల్లోపు ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. దీంతో న్యాయపరంగా ఈ వివాదానికి అత్యున్నత న్యాయస్థానంలో తెరపడింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడం తెలంగాణలో పెను సంచలనంగా మారింది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ గులాబీ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే స్పీకర్ తాజాగా అన్ని పిటిషన్లను కొట్టివేయడం.. దానికి కోర్టు కూడా ఆమోదం తెలపడంతో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రతిపక్ష పార్టీ తదుపరి ఎలాంటి కార్యాచరణ చేపడుతుందనే అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ తదుపరి ఎలాంటి స్టెప్ వేయబోతుందనేది ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో ఆసక్తికరంగా మారింది.

## గోడలపై విజ్ఞాన పాఠాలు

అక్షర దర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల గోడలపై విద్యార్థుల అవగాహన కోసం వినూత్నంగా దేశ, రాష్ట్ర పటాలను చిత్రించారు. హెచ్‌ఎం భూక్యా రాంజీ నాయక్ చొరవతో తెలంగాణ రాష్ట్ర పటాన్ని, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రీనారాయణ సహకారంతో భారతదేశ పటాన్ని జాతీయ, రాష్ట్ర చిహ్నాలతో సహా గీయించారు. ఈ పటాలు విద్యార్థుల్లో భౌగోళిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.




## ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు మృతి
- లచ్యా తండా వద్ద బైక్ ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

అక్షరదర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని లచ్యా తండా వద్ద అతివేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు మృతులను గాలివారిగూడెం గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్, బిక్షం అని పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం ప్రకారం.. ఉదయ్ కిరణ్, బిక్షం తమ బైక్‌పై ప్రయాణిస్తుండగా లచ్యా తండా సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ప్రమాద ధాటికి బైక్ నుజ్జునుజ్జు అవ్వగా, మృతులిద్దరూ రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న మరిపెడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు యువకుల మరణంతో గాలివారిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వదంతులను నమ్మకండి

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- అక్రమ నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు

అక్షరదర్బార్, భూపాలపల్లి: ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ మరియు నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడుతుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొంతమంది దళారులు ఉద్దేశపూర్వకంగా భయాందోళనలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్లు, ఇతర నిత్యావసర సరుకులు సరిపడా అందుబాటులో ఉన్నాయని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మి అనవసరంగా సరుకులను ఇళ్లలో నిల్వ చేసుకోవద్దని సూచించారు.

### - అక్రమ నిల్వపై నిఘా

వదంతులను అడ్డుపెట్టుకుని ఎవరైనా సరుకులను అక్రమంగా నిల్వ చేసినా లేదా అధిక ధరలకు విక్రయించినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అక్రమ నిల్వలకు పాల్పడే వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే దళారులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు.

### - సోషల్ మీడియాపై అప్రమత్తత

సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని, అవసరమైనంత మేరకే సరుకులను కొనుగోలు చేయాలని జిల్లా పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేశారు.

## 16 నుంచి ఒంటి పూట బడులు

- భానుడి భగభగల నుంచి విద్యార్థులకు ఊరట
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తప్పనిసరి
- పదోతరగతి పరీక్షా కేంద్రాలకు మినహాయింపు

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుంచి పాఠశాల విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయించి ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల దిశగా దూసుకుపోతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. యాజమాన్యాలు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తప్పనిసరి. భోజనం ముగిసిన వెంటనే విద్యార్థులు ఇంటికి వెళ్లేలా ఉండాలి.

### పదోతరగతి పరీక్షా కేంద్రాలకు మినహాయింపు

పదోతరగతి పరీక్షలు జరిగే పాఠశాలల విషయంలో విద్యాశాఖ ప్రత్యేక సూచనలు చేసింది. పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూళ్లు మాత్రం పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. మిగిలిన రోజుల్లో సాధారణ పాఠశాలల మాదిరిగానే ఉదయం వేళల్లోనే తరగతులు ఉంటాయి. ఈ మార్పులను గమనించి విద్యార్థులు, ఉపాధ్యాయులు తదనుగుణంగా సిద్ధం కావాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను తుచ తప్పకుండా అమలు చేయాలని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు (డీఈవో) ఆదేశాలు అందాయి. ప్రైవేటు పాఠశాలలు సైతం నిర్ణీత సమయాలనే పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం, ఇతర కనీస సదుపాయాలు కల్పించాలని సూచించింది. విద్యాశాఖ నిర్ణయంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఫోన్ పే ద్వారా లంచం

- ఏసీబీకి చిక్కిన ట్రెజరరీ అధికారి
- వేతనం విడుదలకు లంచం డిమాండ్
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ

అక్షరదర్బార్, యాదాద్రి: ప్రభుత్వ ఉద్యోగి వేతన బిల్లుల మంజూరు కోసం లంచం డిమాండ్ చేసిన ట్రెజరరీ శాఖ సీనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎండీ ఖదీర్ ఒక బాధితుడి నుంచి విడతల వారీగా రూ. 15 వేలు లంచం తీసుకున్నారు. డిజిటల్ పద్ధతిలో నగదు బదిలీ చేస్తే దొరకనని భావించిన సదరు అధికారి ఫోన్‌పే ద్వారా ఈ మొత్తాన్ని వసూలు చేయడం గమనార్హం. బాధితుడికి రావాల్సిన 38 రోజుల వేతనం రూ. 1,09,384 నిలిచిపోయింది. ఈ బిల్లును క్లియర్ చేసేందుకు ఖదీర్ లంచం డిమాండ్ చేశారు. బాధితుడు మొదట ఖదీర్ స్నేహితుడైన నిరంజన్ అనే మరో సీనియర్ అసిస్టెంట్ ఖాతాలోకి రూ. 5 వేలు బదిలీ చేశారు. ఆ తర్వాత మిగిలిన రెండు విడతల నగదును నేరుగా ఖదీర్ ఫోన్‌పే ఖాతాకే పంపించారు. అధికారి వేధింపులు భరించలేక బాధితుడు కలెక్టర్‌కు, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు గురువారం మోత్కూరులోని సబ్ ట్రెజరీ కార్యాలయంపై మెరుపు దాడులు చేశారు. ఖదీర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డిజిటల్ లావాదేవీలను నిశితంగా పరిశీలించారు. లంచం తీసుకున్నట్లు ఆధారాలు లభించడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఖదీర్‌ను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915